ప్రజాశక్తి
శనివారం 28 జనవరి 2023
5
అల్లూరి సీతారామరాజు



30న నైపుణ్య శిక్షణకు ఎంపిక

- జాబ్స్ కో-ఆర్డినేటర్ ఎస్.వెంకటరావు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: కేంద్ర ప్రభుత్వం దీన్ దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన పథకంలో భాగంగా గ్రామీణ నిరుద్యోగ యువత ఉపాధి కోసం వివిధ రంగాల్లో నైపుణ్య ఉచిత శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని జాబ్స్ కో-ఆర్డినేటర్ ఎస్.వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30న పాడేరు వెలుగు కార్యాలయంలో అభ్యర్థుల ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 3 నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. నిరుద్యోగ మైనార్టీ యువతకు ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. శిక్షణ కాలంలో నైపుణ్య ప్రదర్శనను బట్టి ఆయా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తిగల నిరుద్యోగ యువత ఉచిత ఉపాధి శిక్షణ అభ్యర్థుల ఎంపికకు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు ఫోన్: 898543706. 9117257 2737 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

కాఫీ రైతులకు గిట్టుబాటు ధర చెల్లించాలి

▶▶ ఎపి కాఫీ రైతుల సంఘం నేతలు

▶▶ వేంగడలో ఆందోళన, పలు చోట్ల సమావేశాలు



మాట్లాడుతున్న కాఫీ రైతుల సంఘం నేత లక్కు

ప్రజాశక్తి-పాడేరు: కాఫీ పళ్ళకు గిట్టుబాటు ధర కల్పించాలని ఆంధ్రప్రదేశ్ కాఫీ రైతుల సంఘం జాతీయ నాయకులు పాలికి లక్కు డిమాండ్ చేశారు. వనుగుపల్లి పంచాయతీ జాముగూడ, చిడీకూడ గ్రామస్తులతో ఆంధ్రప్రదేశ్ కాఫీ రైతు సంఘం మండల నాయకులు మత్స్యరాజు అధ్యక్షతన సుమారు 60 మంది గిరిజన కాఫీ రైతులతో శుక్రవారం జామిగూడ గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కాఫీ రైతు సంఘం జాతీయ నాయకులు పాలికి లక్కు మాట్లాడుతూ, ఐటీడీఏ చెల్లించాల్సిన రూ.60కోట్లు బకాయిల కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు కాఫీ రైతులు సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఇందుకు 11 మండలాల కాఫీ రైతులతో చలో ఐటిడిఏ నిర్వహిస్తామని, ప్రోత్సాహక నిధులు బకాయిలు వెంటనే చెల్లించే వరకు పోరాటం సాగిస్తామన్నారు. ఢిల్లీలో చెరుకు రైతులు మద్దతు ధర కోసం ధర్నా నిర్వహిస్తున్నారని, మద్దతుగా కాఫీ రైతులి తరలి రావాలని పిలుపునిచ్చారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక నష్టపోతున్నారన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కాఫీ, పసుపు, మిరియాలు, కందులు పండించే రైతులకు మద్దతు ధరలు ప్రభుత్వాలు ఇవ్వ లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రైతు భరోసా రూ.13000 రైతులకు ఏమాత్ర చాలలేదన్నారు. చెరుకు గిట్టుబాటు ధర కల్పించాలని వేలాది మంది రైతులు ఢిల్లీలోధర్నా నిర్వహిస్తున్నారని, వారి పోరాటానికి మద్దతు తెలియజేయవలసిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనుగుపల్లి పంచాయతీ కాఫీ సంఘం నాయకులు మత్స్యరాజు అధ్యక్షతన, భాస్కర్ రావు,సుబ్బారావు చిట్టిబాబు కొంతమంది మహిళలు .ఈ కార్యక్రమంలో జామిగూడ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బకాయిల చెల్లించాలి: చిన్నయ్యపడాల్

పాడేరు: కాఫీ రైతులకు రూ.60 కోట్ల బకాయిలు చెల్లించాలని గిరిజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం జీకే వీధి మండల కేంద్రంలో కోర్ర బాలయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, ఎకరానికి నాలుగు దఫాలుగా రాష్ట్ర ప్రభుత్వం, ఐటిడిఏ ప్రోత్సాహక నిధి చెల్లిస్తుందని, 2018 నుండి2021 వరకు 47 వేల మంది రైతులకు రూ.60 కోట్లను ఇంతవరకు ఎందుకు చెల్లించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నగదు ఇచ్చేంత వరకు వదిలి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు చంటిబాబు, అంపురంగి బుజ్జిబాబు, గడుతూరి సత్యనారాయణ, రామారావు, పది పంచాయతీల కాఫీ రైతులు పాల్గొన్నారు.

కాఫీ రైతుల సమస్యలపై ఆందోళన

అనంతగిరి: కాఫీ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, బకాయి సొమ్ము వెంటనే చెలించాని కాఫీ రైతుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, అరుకు మండలం సుంకర మెట పంచాయతీ సీపీఎం సర్పంచ్ గెమ్మెల చిన్నబాబు డిమాండ్ చేశారు. వేంగడ పంచాయతీలో కాఫీ రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చిన్నబాబు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు, వేంగడ మాజీ సర్పంచ్ కొండలరావు మాట్లాడుతూ, రూ 60.కోట్ల కాఫీ బకాయి సొమ్ము తక్షణమే చెలించాలని డిమాండ్ చేశారు. బేబీ పాల్పర్ మిషన్లు ఉచితంగా ఇవ్వాలన్నారు. కాలిపోయిన కాఫీ తోట లకు నష్ట పరిహారం చెలించాని, కాఫీ ప్రోత్సాహక నిధులు ఒక ఎకరానికి రూ.50 వేలు పెంచాలన్నారు. పంచాయతీ కేంద్రలలో కాఫీ నిల్వలకు కోల్డ్ స్టోరేజ్ సెంటర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలను అధికారులు పరిష్కారం చేయకుంటే కాఫీ రైతులతో ఫిబ్రవరిలో ఐటిడిఏ ముట్టడిస్తామన్నారు. ఈ సమావేశంలో కాఫీ రైతులు డొంబుదొర, మాజీ వైస్ సర్పంచ్ గోవింద్, కేశవ్, మోహన్, గురుమూర్తి, కాఫీ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న కాఫీ రైతులు నాయకులు

ఆర్ఆర్ ప్యాకేజీ, వరద నష్టపరిహారం

త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలి

- పోలవరంపై జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజాశక్తి - రంపచోడవరం

గోదావరి వరదలకు నష్టపోయిన ఇళ్లకు నష్టపరిహారం, 41.5 కాంటూరు పరిధిలోని గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ త్వరగా అందజేయాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి విజ్ఞప్తి చేశారు. అమరావతి తాడేపల్లి ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం పోలవరంపై జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పై అంశాలపై మాట్లాడారు. దీనికి స్పందించిన అధికారులు మార్చి, ఏప్రిల్ నాటికి అందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 45.5 కాంటూర్ పరిధిలో ఉన్న గ్రామాలకు ఏప్రిల్ నుండి సర్వే మొదలు పెడతామన్నారు. ఆర్ అండ్ ఆర్ నోటిఫికేషన్లో అర్హులైన తర్వాత మరణించిన బాధితుల కుటుంబాలకు వారిపై ఆధారపడి ఉంటున్న వారికి నామినీగా గుర్తించి వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందజేస్తారని తెలిపారు. ఆర్ అండ్ ఆర్‌లో భూమికి భూమి ఇచ్చి పట్టాలు ఇవ్వని వారికి, పట్టాలు ఇచ్చి భూమి ఇవ్వని వారికి త్వరలో సెటిల్ చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉన్నతాధికారులతో పాటు పోలవరం ఆర్ అండ్ ఆర్ అధికారి ప్రవీణ్ ఆదిత్య, అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పాల్గొన్నారు.



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న జర్మనీ దేశస్తుడు మార్క్ శాన్స్ గ్రాఫ్

స్పందనకు 42 వినతులు

ప్రజాశక్తి-పాడేరు: స్పందనలో అందిన వినతులపై తక్షణమే విచారణాదికారిని నియమించి తగు విచారణ జరిపి సమస్యలకు పరిష్కార చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. ఐటిడిఎ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన స్పందనలో పిఒ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి, ప్రధాన కార్యదర్శి తరచూ స్పందన ఫిర్యాదులపై సమీక్షిస్తున్నారని, జిల్లాలోని అధికారులు ఫిర్యాదులపై వెంట వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వెబ్సైట్‌లో ఫోటోలతో సహా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఆర్థిక సమస్యలపై తగు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించి నిధులు విడుదలైన వెంటనే ఆ సమస్యను పరిష్కరించాలని ఆ మేరకు ఫిర్యాదుదారులకు సమాధానం పంపాలని సూచించారు. శుక్రవారం జరిగిన స్పందనకు వివిధ అంశాలపై 42 ఫిర్యాదులు అందాయి. ముఖ్యంగా పించన్ అందలేదని, ఉపాధి కల్పించాలని, ఎన్ఆర్ఇజిఎస్‌లో చేసిన పనులకు బిల్లులు, అంగన్వాడి కేంద్రంలో తాగు నీటి సమస్య, సోలార్ పెన్సింగ్ మంజూరు, రహదారుల నిర్మాణానికి సంబంధించిన ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ జే.శివశ్రీనివాసు, జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాలు స్వీకరిస్తున్న పిఒ

విద్యార్థుల సమస్యలపై నిర్లక్ష్యం

అనంతగిరి జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-పాడేరు: గిరిజన విద్యార్థుల సమస్యల పరిష్కారంపై అధికారులకు నిర్లక్ష్యం తగదని అనంతగిరి జడ్పిటిసి సభ్యుడు దిసరి గంగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన పాడేరు ఐటిడిఎ వద్ద చేపడుతున్న రిలే దీక్షల శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ, ప్రజా సంఘాలు 40 రోజులుగా నిర్వహిస్తున్న దీక్షలపై అధికారులు తక్షణమే స్పందించాలని, ఈ ఆందోళన కార్యక్రమాన్ని జటిలం చేయకుండా ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయబద్ధమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రజా సంఘాల వేదిక కన్వీనర్ కే.రాధాకృష్ణ, కో కన్వీనర్ ప్రభుదాస్ మాట్లాడుతూ, ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో తాము శాంతియుతంగా చేస్తున్న రిలే దీక్షలను భగ్నం చేసేందుకు పోలీస్‌లు నోటీసులను జారీ చేయించడం తగదని, దీన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని వెల్లడించారు. దీక్షా శిబిరం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ, అధికారుల రాకపోకలకు ఆటంకంగా ఉందంటూ దీక్షల్ని ఈ నెల 29 లోపు నిలిపి వేయాలని పోలీసులతో నోటీసులు జారీ చేయించడం సరికాదని, గిరిజన విద్యార్థుల సమస్యలపై తాము పేర్కొన్న డిమాండ్లను పరిష్కరించేందుకు అధికారులు తక్షణమే చొరవ చూపాలన్నారు. 40 రోజులుగా దీక్షలు చేస్తున్నా చోద్యం చూడటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చిన్నారావు, నరేష్, లతా కుమారి, స్వరూప, నారాయణ, అరుణ, కృష్ణవేణి, పుష్ప, చంద్రకళ, కళావతి, రాము, భవాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

ఎఒబిలో జర్మనీ దేశస్తుల పర్యటన

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒడిశా సరిహద్దులో జర్మనీ దేశస్తులు శుక్రవారం పర్యటించారు. ఏఓబి సరిహద్దులోని మల్కన్‌గిరి జిల్లా కుడుముల గుమ్మ బ్లాక్ పరిధి గిరిజన గ్రామాల్లో జర్మనీ దేశానికి చెందిన మార్క్ శాన్స్ గ్రాఫ్, ఆయన సతీమణి జూటగ్రాఫ్ సందర్శించి గిరిజన ఆచార సంప్రదాయాలను తిలకించారు. ఆదివాసీల స్థితిగతులపై ఆరా తీశారు. గ్రాఫ్ దంపతులు రాక సందర్భంగా గిరిజనులు తమ సంప్రదాయ థింసా నృత్యాలు చేయగా, వారితో కలిసి గ్రాఫ్ దంపతులు స్టెప్‌లు వేశారు. కుడుముల గుమ్మ బ్లాక్ పరిసర ప్రాంతాల్లో ప్రకృతి రమణీయమైన దృశ్యాలు, పచ్చటి కొండలు, దట్టమైన అడవులను చూసి మంత్రముగ్ధులయ్యారు. గిరిజనులు వేటకు ఉపయోగించే విల్లంబులు, వెదురుతో తయారు చేసిన ఇతర వస్తువులను తిలకించి ఫిదా అయ్యారు. గిరిజనులు ఏ విధంగా జీవనోపాధి కొనసాగిస్తున్నారు? వారి పిల్లలు విద్యాభ్యాసం ఎలా సాగిస్తున్నారు? వంటి అంశాలపై గిరిజనులకు అడిగి తెలుసుకున్నారు.



మార్గాన్ని తాత్కాలికంగా మూసి వేస్తున్నట్టు బోర్డు పెట్టిన అటవీశాఖ సిబ్బంది




ఆందోళన చేపడుతున్న గిరిజన రైతులు

పశువుల దొంగలపై చర్యలకు..

గిరిజనుల ఆందోళన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: పశువులను దొంగలించి, వధించి, మాంసాన్ని విక్రయిస్తున్న వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించగా ఎఫ్ఐఆర్ నమోదు చేసి రిమాండ్‌కు తరలించకపోవడం దుర్మార్గమని బాధిత గిరిజన రైతులు, పలు గ్రామా గిరిజనులు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్ మెయిన్ గేటు ఎదురుగా ఆందోళన చేపట్టారు. నిందితులను తక్షణమే రిమాండ్ కు తరలించాలని, కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. పోలీస్ స్టేషన్ గేటు నుంచి నాలుగు ర్యాలీగా వచ్చి నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం కించాయిపుట్టు సర్పంచ్ సీసా సుభాష్ చంద్ర, కిముడు గాసిరం, మాజీ ఎంపిటిసి సోలగం గాసిరం దొర, జర్రెల వైస్ సర్పంచ్ వంతల గణపతిలు మాట్లాడుతూ, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన 24 గంటల్లో నిందితులను రిమాండ్కు తరలించాల్సి ఉండగా ఫిర్యాదు చేసి ఐదు రోజులు గడుస్తున్నా ఎటువంటి చర్యలు లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను తక్షణమే రిమాండ్ కు తరలించి చట్టపరమైన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మినుములపుట్టు, జంగం సరిగా గ్రామాలతో పాటు, పలు గ్రామాల గిరిజన బాధితులు విశ్వనాథం పడాల్, కర్రి బాబు, ఆర్ కొండలరావు, ఎం.బలరాం పాల్గొన్నారు.



ఆందోళన చేపడుతున్న నాయకులు

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ఆందోళన

ప్రజాశక్తి-డుంబ్రిగూడ: ఏజెన్సీ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఎస్టి బ్యాక్ లాగ్ పోస్టులతో పాటు ఉపాధ్యాయ డీఎస్సీని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గిరిజనులు మండలంలోని అరకు వారపు సంతలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పిసిసి ప్రతినిధి పి.చిన్నస్వామి మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలో ఎంతో మంది నిరుద్యోగ యువత డిగ్రీ, పీజీతో పాటు బీఈడీ, డిఈడి చదివి ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్నారన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఆ పార్టీ స్థానిక మండల అధ్యక్షుడు కే.దయానిధి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతురాజు, నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.


కొండ జర్తలో ప్రత్యేక వైద్య శిబిరం

- కాలినడకన గ్రామానికి చేరుకున్న వైద్యాధికారి, సిబ్బంది

- ఆదివాసీలు నాటు వైద్యానికి దూరంగా ఉండాలని సూచన



పసి బిడ్డకు వైద్యం అందిస్తున్న డాక్టర్ హిమబిందు



నడవడానికి కూడా సరైన దారి లేని మార్గంలో వెళ్తున్న డాక్టర్ హిమబిందు, వైద్య సిబ్బంది

ప్రజాశక్తి -సీలేరు

ఆదివాసీలు నాటువైద్యానికి దూరంగా ఉండాలని జికె.వీధి మండలం దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి హిమబిందు పిలుపునిచ్చారు. మండలంలోని గుమ్మరేవుల పంచాయతీ కొండ జర్త గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ హిమబిందు 79 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గిరిజనుల ఇళ్లను సందర్శించి వారి ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. దీనికి ముందు దారకొండ పిహెచ్‌సి నుంచి వైద్య సిబ్బంది నేలజాతర వరకు వాహనంలో వచ్చి అక్కడ నుంచి కాలినడకన కొండ జర్త చేరుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి హిమబిందు మాట్లాడుతూ వ్యాధి ప్రబలిన వెంటనే ఏఎన్ఎంలనుగాని, హెల్త్ సూపర్వైజర్‌ను గానీ సంప్రదించి ప్రాథమిక చికిత్స పొందాలని సూచించారు. వ్యాధి నయం కాకపోతే ఆసుపత్రికి వచ్చి మెరుగైన వైద్య సేవలు పొందాలన్నారు. పసరు మందులు, నాటు మందులు వేయడం వల్ల వ్యాధి తీవ్రత మరింత అధికమవుతుందని, ప్రాణాలకే ముప్పు కలగవచ్చునని పేర్కొన్నారు. గర్భిణులు క్రమం తప్పకుండా ఆసుపత్రికి వచ్చి తనిఖీలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ రాణి, హెల్త్ సూపర్వైజర్ పోతురాజు, ఎంఎల్‌హెచ్ పి.కుమారి, హెల్త్ అసిస్టెంట్ అప్పారావు, ఫార్మసిస్టు మూర్తి, ఏఎన్ఎంలు మత్స్య కొండ సీత తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు హక్కు పత్రాలివ్వాలి

సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య

ప్రజాశక్తి-కూనవరం

గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య డిమాండ్ చేశారు. మండలంలోని రేపాక గ్రామంలో మాజీ సర్పంచ్ మడకం బొజ్జి అధ్యక్షతన శుక్రవారం పార్టీ సభ్యుల జనరల్ బాడీ సమావేశంలో సీతారామయ్య మాట్లాడారు. గిరిజనులు పూర్వం నుండి సాగుచేస్తున్న పోడు భూములకు 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హక్కు పత్రాలు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే పోడు పట్టాలు ఇవ్వకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి బి. బొర్రయ్య, శాఖ కార్యదర్శి మడకం జోగయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సీతారామయ్య

అటవీశాఖ, వన సంరక్షణ సమితి ఆధ్వర్యాన

పొల్లూరు జలపాతం అభివృద్ధి

- డిఎఫ్ఒ సాయిబాబా

ప్రజాశక్తి-మోతుగూడెం

చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పరిధిలోని పొల్లూరు జలపాత అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు డిఎఫ్ఒ వాకపల్లి సాయిబాబా తెలిపారు. అటవీశాఖ విశ్రాంతి భవనంలో శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వన సంరక్షణ సమితి ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో జలపాతాన్ని మొదటి దశలో కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా శుక్రవారం నాలుగు రోజులు పర్యాటకులకు అనుమతి ఉండదని పేర్కొన్నారు. జలపాతం వద్ద చుట్టూ పరిసరాలలో ఎటువంటి చెత్తా చెదారం లేకుండా తమ సిబ్బందితో శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. మొదటిదశ పనులలో భాగంగా జలపాతానికి 50 మీటర్లు ఇవతల చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి, పర్యాటకుల వద్ద కొంత రుసుము వసూలు చేస్తామన్నారు. వాహనాల పార్కింగ్ ఏర్పాట్లు, స్త్రీలకు దుస్తులు మార్చుకోవడానికి వెదురుతో రెండు, మూడు గదులు, పర్యాటకులు భోజనాలు చేయడానికి అనువుగా తగు ఏర్పాట్లు చేపడతామని పేర్కొన్నారు. జలపాతానికి వచ్చిన ఆదాయంతో వన సంరక్షణ సమితి సిబ్బందికి జీతాలు, జలపాతం అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఇక్కడికి వచ్చిన పర్యాటకులు అసాంఘిక కార్యక్రమాలు చేపడితే అటవీశాఖ సెక్షన్ కింద కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లక్కవరం ఇన్‌ఛార్జి ఎఫ్ఆర్ఒ కొండలరావు, డిఆర్ఒ సత్యనారాయణ రాజు, గార్డు వెంకట్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి- విఆర్.పురం

మండలంలోని తహశీల్దారు కార్యాలయ రోడ్డు వద్ద స్థానిక ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. రేఖపల్లి నుండి చింతూరు ప్రధాన రహదారి మీదుగా వచ్చిపోయే ప్రతి వాహనాన్ని ఆపి నిశితంగా తనిఖీలు చేసి, వాహన రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని పలువురు వాహనదారుల నుండి అపరాధ రుసుము వసూలు చేశారు. ఎస్సై దుర్గాప్రసాద్ వాహనదారులకు పలు సూచనలు చేశారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ఓవర్ లోడు, ఓవర్ స్పీడు ప్రమాదకరమని, వాహనాల్లో గంజాయి, నాటు సారా వంటి అక్రమ రవాణాలకు పాల్పడరాదని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధలు ఉల్లంఘించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ప్రతి నెలా 27న గ్రీవెన్స్


బుక్‌లెట్లను ఆవిష్కరిస్తున్న పిఒ, జెసి

ప్రజాశక్తి-పాడేరు:కేంద్ర ప్రభుత్వ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న ఉద్యోగుల భవిష్య నిధి ఉద్యోగుల, పింఛనుదారుల సమస్యల పరిష్కారం దిశగా ప్రతి నెలా 27వ తేదీన గ్రీవెన్స్ డే నిర్వహిస్తారని భవిష్య నిధి కార్యాలయ ఎన్ఫోర్స్మెంట్ అధికారి పి.వెంకటగిరి తెలిపారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జరిగిన స్పందనలో భాగంగా ఎన్ఫోర్స్మెంట్ అధికారి మాట్లాడుతూ, ఉద్యోగుల ఖాతాలలో నగదు జమ కాకపోవటం, తప్పుగా జమ కావడం, రుణాల మంజూరు, ఇన్స్యూరెన్స్ క్లైములు తదితర సమస్యలపై అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపడతామని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా భవిస్యనిధి సభ్యుల కోసం సమాచార బుక్లెట్‌ను జేసి శివ శ్రీనివాసు, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాల కృష్ణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థినిని దండించడం తగదు

ప్రజాశక్తి-పాడేరు:అల్లూరి జిల్లా డుంబ్రిగూడ మండలంలో జాముగూడ ఆశ్రమం పాఠశాలలో విద్యార్థులు మెనూ అమలుపై అడిగినందుకు, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గిరిజన విద్యార్థినిని కర్రతో దండిస్తున్న వార్తలు పత్రికల్లో రావడంపై ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా కార్యదర్శి ప్రభుదాస్ శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రధానోపాధ్యాయినిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను కొట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఇటువంటి భయంతోనే చాలామంది విద్యార్థులు ఉడికీ ఉడకని అన్నం తింటూ అనారోగ్యానికి పాలవుతున్నారని తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు పాఠశాలలో పర్యవేక్షణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ప్రమాదాలను నివారించండి

ప్రజాశక్తి-పాడేరు:ఎలక్ట్రీషియన్ - డే సందర్భంగా శుక్రవారం పాడేరులో మోద ఉమా నీలకంఠేశ్వర ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్ యూనియన్ ప్రతినిధులు కోటగుల్లి రామారావు, ఎస్.దామోదరంలు విద్యుత్ ప్రమాదాలను అరికట్టాలని కోరుతూ అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. అన్ని మండలాల్లో తహసిల్దార్లకు యూనియన్ తరపున వినతి పత్రాలు అందించామన్నారు.వైస్ ప్రెసిడెంట్ సరమండ వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి సందడి దామోదరం, కిల్లు హరిబాబు, కోట సన్యాసిరావు, పట్నాయక్, కే.సత్యారావు, మఠం స్వామి నాయుడు, బి.ప్రకాష్, శివశంకర్, బాలరాజు, .సతీష్, లకే గిరి పాత్రుడు, నితిన్, కె.పూర్ణచంద్ర పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించరూ..

గిరిజన సంఘం ఆధ్వర్యాన విద్యుత్ అధికారులకు మన్యవాసుల వినతి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని మాదల పంచాయతీ చిట్టంగొంది, పాలమనివలస, మెదరసొల్ల, దోమలజోరు, రక్తకండి గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం అరకు డివిజన్ ఎఇకి గిరిజన సంఘం నాయకులు, గ్రామస్థులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకులు మాట్లాడతూ, హుద్యుత్ తుఫాన్ కారణంగా ఐదు గ్రామాలకు చెందిన ఐదుగురు పిటిజిలు గిరిజనులు మరణించారని, దీంతో టీడీపీ ప్రభుత్వం మోడల్ కొలనిలో ఇళ్లను సమారు 100 కుటుంబాలకు మంజూరు చేశారన్నారు. ఈ మోడల్ కాలనీలో 2014 నుండి నేటి వరకు విద్యుత్ సదుపాయం కల్పించక పోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే విద్యుత్ సదుపాయం కల్పించకపోతే భవిష్యత్తులో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న, పంచాయతీ నాయకులు జి.చందు, పి.అప్పారావు, రూప, కళ్యాణ్, కే.సుబ్బారావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


ఎఇకి వినతిపత్రం ఇస్తున్న గిరిజన సంఘం నేతలు, గిరిజనులు

ఐఒసిఎల్ నిధులతో కంబాల కొండ అభివృద్ధి

రూ.90 లక్షల సిఎస్ఆర్‌తో జీవవైవిధ్య కేంద్రం ఏర్పాటు

అటవీ, ఐఒసిఎల్ అధికారుల మధ్య కుదిరిన ఒప్పందం


ఒప్పందపత్రాలపై సంతకాలు చేస్తున్న అటవీ, ఐఒసిఎల్ అధికారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యంలో తూర్పు కనుమలలో జీవవైవిధ్య కేంద్రం ఏర్పాటుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐఒసిఎల్) కార్పొరేట్ ఎన్విరాన్‌మెంటల్ రెస్పాన్సిబిలిటి (సిఎస్ఆర్)లో భాగంగా రూ.90 లక్షలను అందజేసింది. శుక్రవారం ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల సమావేశ మందిరంలో ఐఒసిఎల్‌కు, విశాఖపట్నం అటవీ డివిజన్ మధ్య ఈ మేరకు ఒప్పందం కుదిరింది. ఐఒసిఎల్ సిఎస్ఆర్ నిధులతో కంబాలకొండలో ఆర్కిడేరియం, ఔషధ మొక్కల తోట, హెర్బల్ గార్డెన్, ప్రకృతి వివరణ కేంద్రం వంటి వాటిని అభివృద్ధి చేయనున్నారు.

. ఈ సందర్భంగా డిఎఫ్ఒ అనంత శంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఏకైక పర్యావరణ పర్యాటక సముదాయం ఏర్పాటుకు నిధులు కేటాయించిన ఐఒసిఎల్‌కు కృతజతలు తెలిపారు. రాబోయే మూడు నెలల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో పనులను పూర్తి చేయాలని యోచిస్తున్నట్టు తెలిపారు. కంబాల కొండలో జీవ వైవిధ్య కేంద్రం సందర్శకులకు ప్రధాన ఆకర్షణ కానుందని తెలిపారు. ఐఒసిఎల్ సౌత్ ఈస్టర్న్ రీజియన్ పైప్‌లైన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, అడవుల పరిరక్షణలో తమ సంస్థ సహకారం, భాగస్వామ్యం కావడం, అటవీశాఖతో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఐఒసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్.పట్నాయక్, సబ్ డిఎఫ్ఒ ధర్మ రక్షిత్, రామ్ నరేష్ , అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నెలాఖరైనా..

రేషన్ బియ్యం ఇవ్వరేం..!

కలెక్టర్‌కు గిరిజనుల వినతి

ప్రజాశక్తి-డుంబ్రిగూడ:మండలంలోని రంగిలిసింగి పంచాయతీ రంగిలిసింగి, లింగగూడలోని రేషన్ లబ్ధిదారులకు జనవరి నెలకు సంబంధించిన ఉచిత బియ్యం ఇవ్వాలని కోరుతూ ఆ గ్రామస్తులు శుక్రవారం పాడేరులో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కు స్పందనలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు పి.దొంబు మాట్లాడుతూ, లింగగూడ, రంగిలిసింగిలో ఒకే వాలంటీర్ పరిధిలోని సుమారు 40 కుటుంబాలకు సంబంధించిన రేషన్ బియ్యంను గుంటసీమ పంచాయతీ దొరగుడ డిఆర్ డిపోలో బియ్యం పంపిణీ చేసేవారన్నారు. ఈనెల జనవరికి సంబంధించి ఉచిత బియ్యాన్ని ఇప్పటివరకు పంపిణీ చేయలేదన్నారు. దీనిపై స్థానిక వీఆర్వోను సంప్రదిస్తే దొరగుడ డిఆర్ డిపో నుంచి రంగిలిసింగి డిపోలో రేషన్ కార్డులను మార్చడం జరిగిందని చెపుతున్నారన్నారు.రంగిలిసింగి డిఆర్ డిపోలో కూడా ఈ గ్రామలకు సంబంధించిన రేషన్ లబ్ధిదారుల పేరు లేక పోవడంతో గిరిజనులు ఉచిత బియ్యంకు నోచుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రంలో పేర్కొన్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్తులు పి.మోహన్ దాస్, పి.మహాదేవ్, వి.కేశవరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి వరహాలమ్మ

ప్రజాశక్తి -పెదబయలురూరల్:మండలంలోని లక్ష్మి పేట పంచాయతీ పాములపుట్ట గ్రామంలో శుక్రవారం ఎంపిపి బొండా వరహాలమ్మ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పాములపుట్ట గ్రామంలో ఎన్నో ఏళ్ళ నుండి రహదారి సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నట్లు స్థానిక సర్పంచ్ లకే అశోక్ కుమార్ తన దృష్టికి తెలిపారని, వెంటనే మండల పరిషత్ నుంచి నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రంలో అశోక్ కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రజాగర్జనను జయప్రదం చేయాలని

గాజువాకలో అఖిలపక్షం భారీ ర్యాలీ

ప్రజాశక్తి -గాజువాక : స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 30న ఉక్కునగరం, తృష్ణ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఉక్కు ప్రజాగర్జన జయప్రదం చేయాలని కోరుతూ శుక్రవారం సాయంత్రం అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో పాత గాజువాక నుంచి కొత్త గాజువాక వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి గాజువాక వర్తక సంఘం ప్రతినిధులు, తోపుడు బళ్లు, ఇతర వర్తకులు మద్దతు పలికి ర్యాలీలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం రాంబాబు మాట్లాడుతూ, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తక్షణమే విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణపై కేంద్ర ప్రభుత్వం వెనక్కు తగ్గి, ఉపసంహరించుకునే ప్రకటన చేసే వరకు పోరాటాలు కొనసాగిద్దామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో సిపిఐ నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కోకన్వీనర్ అయోధ్యరాం మాట్లాడుతూ, రూ.లక్షల కోట్లు విలువ చేసే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కార్పొరేట్లు, ప్రయివేటు కంపెనీలకు అమ్మాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సిఐటియు నేతలు ఎన్.రామారావు, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి ఈ రామస్వామి, టిడిపి నాయకులు ప్రసాద్, శ్రీనివాస్, కాంగ్రెస్ నేత అచ్చిబాబు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న అఖిలపక్ష పార్టీల నేతలు

నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి-పాడేరు:జిల్లాలోని పివిటిజి గిరిజనుల అభివృద్ధి, స్థితిగతులు పరిశీలనకు కేంద్ర బృందం ఈనెల 28వ తేదీ నుండి 30 వరకు మూడు రోజులు పర్యటిస్తుందని ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి రోణంకి గోపాల కృష్ణ తెలిపారు. శుక్రవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఈ పర్యటనలో భాగంగా కేంద్ర బృందం దొంగ్రియ ఖోంద్, బోండ పోర్జ, పోరంగి పోర్జ పివిటిజి గ్రూపుల సభ్యులను కలుస్తారని తెలిపారు. ఈ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వం తరుపున గిరిజన సంక్షేమ సంయుక్త సంచాలకులు బి.మల్లిఖార్జునరెడ్డి, ఐటిడిఎ ఎపిఓలు, టిసిఆర్, టిఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.చిన్నబాబు, ట్రైకార్ జనరల్ మేనేజర్ సిఎ. మనికుమార్, ఐటిడిఎ డిడి కొండలరావు పాల్గొంటారన్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలో సంబంధిత తహసిల్దార్లు, ఎంపిడిఓలు, ఎంఇఓలు, సహాయ ఇంజినీర్లు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు సహకరించాలని పిఓ కోరారు.


సైకిల్‌పై సీలేరు చేరుకున్న జ్యాయికిమ్

సీలేరు చేరుకున్న స్విట్జర్లాండ్ యువకుని సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - సీలేరు : స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యాయికిమ్ చేపట్టిన సైకిల్ యాత్ర శుక్రవారం సీలేరు చేరుకుంది. ఇక్కడ రసూల్ లాడ్జిలో విశ్రాంతి తీసుకొని శనివారం తన సైకిల్ యాత్రను కొనసాగించనున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ 2022 మే 27న స్విట్జర్లాండ్‌లో సైకిల్ యాత్ర ప్రారంభించగా, 2023 జనవరి 27న సీలేరుకు చేరుకొనే నాటికి 9 నెలల కాలంలో 18 వేల కిలోమీటర్లు పూర్తి చేసినట్లు తెలిపారు. దేశంలో డెహ్రాడూన్, ముంబై, కొచ్చిన్ తదితర ప్రాంతాల్లో ఇప్పటికే సైకిల్ యాత్ర చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పలు దేవాలయాలు, విద్యాలయాలను సందర్శించినట్లు పేర్కొన్నారు. పలు అపూర్వ దృశ్యాలను తిలకించినట్లు తెలిపారు. ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతదేశానికి ఒక ప్రత్యేకత ఉందన్నారు. భారత్‌లోని అన్ని రాష్ట్రాల్లోనూ సైకిల్ యాత్ర చేపట్టి ప్రజలు స్థితిగతులు, గిరిజనులను సంప్రదాయాలు తెలుసుకొని తమ దేశంలో తెలియజేస్తానని చెప్పారు.


బోరు మరమ్మతు పనులు చేయిస్తున్న ధర్మరాజు

చేతి పంపులకు మరమ్మతులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ఎన్నో ఏళ్లుగా పాడైపోయి మూలలపడ్డ చేతి బోర్లకు స్థానిక కో-ఆప్షన్ సభ్యులు గురుకు ధర్మరాజు ఆధ్వర్యంలో శుక్రవారం మరమ్మతులు చేయించారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో గిరిజనులు తాగునీటికి ఇబ్బంది పడకుండా ముందస్తు చర్య భాగంగా స్థానిక మారేడుమిల్లి గ్రామంలోని చెలకవీధి చుట్టుపక్కల ఉన్న పాడైపోయిన చేతిపంపులకు మరమ్మతులు చేశారు. మండలంలో ఎక్కడైనా చేతి పంపులు మరమ్మతులకు గురైతే వెంటనే ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని ధర్మరాజు సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు నచ్చి జనసేన పార్టీలో చేరానని జివిఎంసి 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. ఇక నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. గురువారం అల్లిపురంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన వార్డు కార్యకర్తలు, నాయకులు, కుటుంబ సభ్యులతో చర్చించిన తర్వాతే తాను జనసేనలో చేరినట్లు పేర్కొన్నారు. రాజకీయాలు, కుల మతాలు, వర్గాలకతీతంగా వార్డులోనే కాకుండా దక్షిణ నియోజకవర్గంలో తాను పలు సేవా కార్యక్రమాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గంలో ప్రజల మద్దతు తనకుందని అన్నారు. ప్రస్తుతం దక్షిణ నియోజకవర్గం వైసిపిలో కొనసాగుతున్న గ్రూపుల పోరు వల్ల ఆ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని తెలిపారు.

ఉక్కు ఉద్యమం.. స్ఫూర్తిదాయకం

పోరాటాలను అవహేళన చేస్తే పాలకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
సిఐటియు రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు

ప్రజాశక్తి - ఉక్కునగరం

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రెండేళ్లుగా విశాఖలో జరుగుతున్న ఉక్కు ఉద్యమం.. దేశానికే స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందని సిఐటియు రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు అన్నారు. శుక్రవారం ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో స్టీల్ సిఐటియు అధ్యక్షులు వైటి.దాస్ అధ్యక్షతన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన రాఘవులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై జరుగుతున్న పోరాటాలను అవహేళన చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ వ్యతిరేకతపై పోరాడుతున్న వారిలో మత విద్వేషాలను సృష్టించడం, ఐక్యతకు విఘాతం చేసే విధంగా కృషి చేయడం, ఉద్యమాలను బలహీనపరిచే విధంగా కుట్రలు, కుతంత్రాలకు దిగడం, తద్వారా ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు ధారపోయడం కేంద్ర ప్రభుత్వ విధానమని వివరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం దేశ పరిశ్రమల రక్షణ ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ స్ఫూర్తితో దేశవ్యాప్త రాజకీయ ఉద్యమాల ద్వారా కేంద్రానికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సిఐటియు సీనియర్ నాయకులు కె.లోకనాథం మాట్లాడుతూ రాష్ట్రంలోనే అనేక మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం అనుసరిస్తున్న విధానం అత్యంత దుర్మార్గంగా ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ ఐక్యంగా ప్రజా ఉద్యమాలను మరింత బలోపేతం చేయవలసిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. దీనికి ప్రధాన భూమికగా ఈ నెల 30న జరుగుతున్న ప్రజాగర్జన నిలువనుందని, దీన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి కన్వీనర్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఉక్కు ప్రజా గర్జనపై పరిశ్రమల్లోనూ, జనావాసాల్లోనూ విస్తృత ప్రచారం జరుగుతోందన్నారు. మోడీ సర్కారు ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకునేంత వరకూ పోరాటం సాగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎన్.రామారావు, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, నాయకులు బి.అప్పారావు, గంగాధర్, యు.వెంకటేశ్వర్లు, టివికె.రాజు, కెవి.సత్యనారాయణ, మరిడయ్య, నీలకంఠం, ఒవి.రావు, బిఎన్.మధుసూదన్, కె.సత్యనారాయణ, డిసిహెచ్.వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, సూర్యనారాయణ తదితరులతో పాటు వివిధ విభాగాల కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బివి.రాఘవులు, వేదికపై లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

కొనసాగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు కొనసాగుతోంది. శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఫిజిక్స్‌లో 81 మంది, గణితంలో 156 మంది ఉపాధ్యాయులను వివిధ పాఠశాలలకు సర్దుబాటు చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ నేతృత్వంలో జరుగుతున్న టీచర్ల సర్దుబాటులో పలు ఉపాధ్యాయ సంఘాలు నాయకులు పాల్గొన్నారు. గురువారం సాంఘికశాస్త్రం, ఇంగ్లీష్, బయాలజీలో 216 మంది స్కూల్ అసిస్టెంట్లను సర్దుబాటు చేశారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - మారేడుమిల్లి

రంప చోడవరం డివిజన్‌లో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని జాతీయ ఆదివాసీ సంరక్షణ సమితి కన్వీనర్ కారం సీతారామన్న దొర డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ ప్రాయోజిత పథకం కింద అరకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పార్వతీపురం, పాడేరులో రెండు ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరు అయ్యాయని, ఏజెన్సీలో కీలక ప్రదేశమైన రంపచోడవరం డివిజన్లో కూడా ప్రభుత్వం వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని కోరారు. ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనులకు నేటికీ సూపర్ స్పెషాలిటీ వైద్యం అందడం లేదన్నారు. రంపచోడవరం డివిజన్‌కు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరైందని, నిర్మాణం కూడా జరుగుతుందని, అయితే దానివల్ల ఒరిగేదిలేదని ఆయన పేర్కొన్నారు.

రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో సరైన సదుపాయాలు, వైద్యులు లేక చీటికిమాటికి రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం ప్రభుత్వ ఆసుపత్రులకు వైద్య నిమిత్తం రిఫర్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సమితి నాయకులు కారం గంగాధర్ రావు, కత్తుల ప్రభాకర్ రెడ్డి, ఆరియం ప్రశాంత్, సారపు ప్రతాప్ దొర, సూర్లజోషి రెడ్డి, కాకా శివశంకర ప్రసాద్, కారం చిన్నబ్బాయి, కొమరం శాంతిరాజు, కోర ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తామరపల్లిలో 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - రంపచోడవరం : మండలంలోని తామరపల్లి సచివాలయం పరిధిలోని గోపవరం, ఈతలపాడు, కోమరవరం గ్రామాలలో శనివారం మధ్యాహ్నం 2 గంటం నుండి ఎమ్మెల్యే ధనలక్ష్మి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైసిపి నాయకులు తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు ప్రశంసా పత్రం

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం సీలేరు అంగన్వాడీ కేంద్రం -2లో కార్యకర్తగా పని చేస్తున్న కె.ఈశ్వరమ్మ ఉత్తమ కార్యకర్తగా ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా ఈశ్వరమ్మ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ మాట్లాడుతూ గణతంత్ర వేడుకలు సందర్భంగా ప్రతిభ పురస్కారం తీసుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసినందుకు గాను ఐసిడిఎస్ అధికారులు గుర్తించి ప్రశంసా పురస్కారం వచ్చే విధంగా కృషి చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

కెజిహెచ్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ, కలెక్టరేట్ : కెజిహెచ్‌లో జరుగుతున్న సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అన్నారు. శుక్రవారం ఉదయం కెజిహెచ్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పలు విభాగాల్లో తనిఖీలు చేపట్టారు. ఒపి గేటు పరిసర ప్రాంతాలను, అత్యవసర శస్త్ర చికిత్సా విభాగాన్ని, గిరిజన సేవా కేంద్రాన్ని, డ్యూటీలో ఉన్న వైద్యుల విశ్రాంతి గదులను, దంత వైద్య విభాగాన్ని, ఔషధ నిల్వల స్టోరు రూమ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒపి విభాగం ప్రధాన ద్వారం దగ్గర జరుగుతున్న పార్కు సుందరీకరణ పనులను వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా ప్రజా మరుగుదొడ్లను పరిశీలించి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. మంచినీటి ప్లాంట్‌ను తనిఖీ చేసి పక్కనే ఉన్న మురుగునీటి కాలువలపై పలకలను ఏర్పాటు చేయాలన్నారు. రోగులతో పాటు వచ్చే సహాయకులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఉండేలా విశ్రాంతి గదులను తీర్చిదిద్దాలన్నారు. అత్యవసర శస్త్ర చికిత్సా గదులలో అవసరమైన చోట ఎసిలను ఏర్పాటు చేసి రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. విధులలో ఉన్న డాక్టర్లు అవసరమైన సమయంలో విశ్రాంతి తీసుకొనేందుకు ఆధునీకరించిన డాక్టర్స్ రూమ్‌ను పరిశీలించారు. అనంతరం దంత వైద్య విభాగాన్ని పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఒపి రశీదుల విభాగాన్ని పరిశీలించి రోగులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఆధునీకరించడంతో పాటు వాహనాల పార్కింగ్, రోడ్డు నూతనంగా వేయాలని అన్నారు. ఒపి వద్ద ఉన్న గోడకు పెయింటింగ్ వేయించాలని, ప్రవేశ ముఖ ద్వారాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్, ఆర్ఎంఒ వాసుదేవరావు, వివిధ విభాగాల డాక్టర్లు, ఎపిఎంఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటన రద్దు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి విశాఖ పర్యటన రద్దయినట్టు ముఖ్యమంత్రి అదనపు వ్యక్తిగత కార్యదర్శి కె.నాగేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి సిఎం శనివారం చినముషిడివాడలోని శ్రీ శారదా పీఠానికి రావాల్సి ఉంది. అలాగే సాగరమాల కన్వెన్షన్ హాల్, రుషికొండ ఐటీ పార్క్ ప్రాంతాల్లో జరిగే పలు కార్యక్రమాల్లోనూ, పలువురి శుభకార్యాల్లోనూ పాల్గొనాల్సి ఉంది. అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. ఈ నేపథ్యంలో అకస్మాత్తుగా సిఎం పర్యటన రద్దయింది. దీనికిగల కారణాలను అధికారులు తెలుపలేదు.

666వ రోజుకు 'ఉక్కు' జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగా ప్రభుత్వ రంగంలో విశాఖలో ఏర్పాటైన స్టీల్‌ప్లాంట్ ఉత్తరాంధ్రకే కాకుండా ఆంధ్రప్రదేశ్‌కే గర్వకారణమని ఎఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె.రెహమాన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 666వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఎఐటియుసి కార్యకర్తలు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్ల పెట్టుబడితో విశాఖలో స్టీల్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేసిందని, కార్మికుల శ్రమతో ఈ కర్మాగారం దినదినాభివృద్ధి చెంది కేంద్ర ప్రభుత్వానికి వివిధ రకాల పన్నుల రూపంలో రూ.55 వేల కోట్లను చెల్లించిందని తెలిపారు. ప్రభుత్వాలకు ఇంత భారీ స్థాయిలో ఆదాయం సమకూర్చే పరిశ్రమ దేశంలో మరొకటి లేదన్నారు